

మెయిన్‌లో..
వనసమారాధనలో రచ్చ.. రచ్చ
» కుర్చీలు విసురుకుని కొట్టుకున్న ఇరువర్గాలు
పాదగయలో జడ్పీ సీఈవో పూజలు 7
రత్నగిరికి పోటెత్తిన భక్తులు 7



కాకినాడలో జరిగిన శెట్టిబలిజ కార్తీక వనసమారాధనలో మంత్రి సుభాష్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

సందడిగా సాగరతీరం..

సర్పవరంజంక్షన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సాయం సమయాన.. సాగరతీరాన ఆ నందంగా గడిపేందుకు సందర్శకులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్తీకమాసం ఆదివారంకావడంతో బీచ్‌లో ఆనందంగా గడిపి సామూహికంగా సర్వే తోటల్లో వన భోజనాలు చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి అధికసంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో కోలాహలం నెలకొంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోన్న కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌కి ఆదివారం వేలాదిమంది సందర్శకులు తరలి వచ్చి సందడి చేశారు. బీచ్‌లో చిన్నా..పెద్దా అనే తేడాలేకుండా


జనసంద్రమైన సూర్యారావుపేట బీచ్

ఆటపాటలతో కాలక్షేపం చేశారు. చిన్నారులు బీచ్‌లో ఇసుకలో ఆటలు, బీచ్‌లో ఏర్పాటు చేసిన పలు క్రీడాపరికరాలపై ఆటలు ఆడుతూ ఉత్సాహంగా గడిపారు. యువత సముద్ర స్నానాలను ఆచరిస్తూ కేరింతలతో గడిపారు. సందర్శకులు బృందాలుగా వచ్చి కార్తీక వనసమారాధనలో భోజనాలు చేశారు. కాకినాడ మెరైన్ సీఐ రామోహ్మన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్‌ఐ సురేష్, ఏఎస్‌ఐ మధు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. సముద్రం లోతుకు వెళ్లకుండా సందర్శకులను అప్రమత్తం చేశారు.



ఆదివారం కావడంతో సందర్శకులతో కళకళలాడుతున్న కాకినాడ సూర్యారావుపేట బీచ్

ఆధార్ తప్పులు..
అపార్ కష్టాలు



జిల్లాలో అపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులు ఎంతగా కృషి చేస్తున్నా ఆధార్‌లో ఉన్న తప్పులు ప్రధాన అడ్డంకిగా మారాయి. దీన్ని అధిగమించేందుకు నిబంధనలు సరళీకరించి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి తప్పులు సవరిస్తున్నారు. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి జీవిత కాల గుర్తింపు సంఖ్యతో కార్డు జారీ చేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం ఆటోమేటెడ్ పర్మినెంట్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) పేరుతో 12 అంకెల సంఖ్యతో కార్డు జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సంఖ్య ద్వారా విద్యార్థి అకడమిక్ పురోగతిని అంచనా వేసేందుకు వీలుంటుంది. అతడికి సంబంధించిన డేటా అంతా దీనిలో నిక్షిప్తమై ఉండడంతో ఉన్నత చదువులు చదివినా లేదా వేరే ప్రాంతాలకు వెళ్లి విద్యనభ్యసించినా దేశవ్యాప్తంగా అపార్ నెంబరు ఉపయోగపడుతుంది.

- » జిల్లాలో కొనసాగుతున్న అపార్ నమోదు ప్రక్రియ
- » ప్రాథమిక పాఠశాలల్లో వేగవంతం
- » హైస్కూళ్లు, కళాశాలల్లో నెమ్మది
- » అధికారుల నిరంతర పర్యవేక్షణ
- » అవాంతరాలు అధిగమించేందుకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు
- » నిబంధనల సరళీకరణ

తొండంగి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 12వ తరగతి వరకూ చదివే విద్యార్థులకు దీన్ని అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో 1నుంచి 12వతరగతి వరకూ 3లక్షల39వేల643 మంది విద్యార్థులు నమోదు కాగా 2లక్షల48 వేల 347మంది విద్యార్థులకు అపార్‌సంఖ్య జనరేట్ చేయడం ద్వారా 73.12శాతాన్ని సాధించారు. పాఠశాలల కేటగిరీవారీగా చూస్తే ప్రాథమిక పాఠశాలల్లో నమోదు లక్షా37వేల872 కాగా లక్షా18వేల233మంది విద్యార్థులకు అపార్ జనరేట్ చేయడం ద్వారా 85.76శాతాన్ని సాధించారు. యూపీ స్కూళ్లలో 96వేల419మంది విద్యార్థులకుగాను 75,200మందికి అపార్ జనరేట్ అయ్యి 77.99శాతం సాధించారు. ఉన్నత పాఠశాలల్లో 60వేల356మంది నమోదు కాగా 39వేల183మందికి అపార్ జనరేట్ అయి 64.92 శాతం సాధించారు. మొత్తంగా 1 నుంచి 10 వరకూ 78.95శాతం అపార్ నమోదు సాధించారు. జూనియర్ కళాశాలల్లో నమోదు 44,996కాగా15,731మందికి అపార్‌జనరేట్ అయ్యి 34.96శాతం సాధించారు. మిగిలినవారికి అపార్ నెంబరు జనరేట్ చేసేందుకు తిప్పలుతప్పట్లేదు.

అన్నీ సరిగా ఉంటేనే అపార్

అపార్ నెంబరు జనరేట్ కావడానికి యుడైస్ ప్లస్‌లో ఉన్న వివరాలు, అడ్మిషన్ రిజిస్టర్‌లో వివరాలు, ఆధార్‌లో ఉన్న వివరాలు కచ్చితంగా సరిపోవాలి. నెంబరు జనరేట్ చేసేందుకు జనరల్ ప్రొఫైల్, ఎన్రోల్‌మెంట్ ప్రొఫైల్, ఫెసిలిటీ ప్రొఫైల్ పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటిలో ముఖ్యమైనది జనరల్ ప్రొఫైల్. దీనిలో నమోదు చేసే వివరాలు పైమూడు వివరాలతో సరిపోవాలి. కానీఆధార్‌లో ఉన్న తప్పులకారణంగా ఇక్కడ నమోదుకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఒక అక్షరం తప్పున్నా,అదనంగా స్పేస్‌ఉన్నా సిస్టం అంగీకరించడంలేదు. దీనివల్ల నమోదు ఆలస్యమవుతోంది.

అధిగమించేందుకు వెసులుబాట్లు

అపార్ నమోదులో ఏర్పడుతున్న అడ్డంకులను అధిగమించేందుకు ప్రభుత్వం వెసులుబాట్లు కల్పించింది. అడ్మిషన్ రిజిస్టర్‌లో ఉన్న తప్పులను సవరించేందుకు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ప్రాథమిక పాఠశాలల్లో సవరణకు ఎంఈవోలకు అధికారం ఇస్తూ వచ్చే మార్చివరకూ అవకాశం కల్పించింది. పుట్టిన తేదీ సవరణకు ప్రధానోపాధ్యాయులు ఇచ్చే స్టడీ సర్టిఫికెట్‌తోపాటు పంచాయతీ కార్యదర్శి ఇచ్చే నాన్‌ఎవైలబుల్ సర్టిఫికెట్ ఆధారంగా ఆధార్‌లో పుట్టిన తేదీ లేదా పేరు మార్పునకు అవకాశమిచ్చారు.

ఆధార్‌లో అనేక తప్పులు

ఆధార్‌లో అనేక తప్పులు వెలుగు చూస్తున్నాయి. పుట్టిన తేదీ, ఇంటిపేరుల్లో తప్పులతోపాటు పేరులోను ఇంటి పేరులోను ఇక అక్షరం తేడా ఉన్నా అపార్ జనరేట్ కావడంలేదు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఇటీవలే ఆధార్ పొంది ఉండడం, బర్త్ సర్టిఫికెట్లపై తల్లిదండ్రులకు అవగాహన ఉండడంతో వారి విషయంలో అపార్ నమోదు వేగవంతం అవుతున్నా, హైస్కూల్, జూనియర్ కళాలల విద్యార్థులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అడ్మిషన్ సమయంలో ఆధార్ లేకుండా జాయిన్ చేయడం, ఆధార్‌లో కొన్ని తప్పులతో అపార్ జనరేట్ కావడంలేదు.

అధికారుల నిరంతర పర్యవేక్షణ

జిల్లా అధికారుల నిరంతరం అపార్ నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు కలెక్టర్ సమీక్ష జరిపి గుర్తించిన సమస్యలను అధిగమించేందుకు ప్రత్యేక సూచనలు చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి నిరంతరం విద్యాశాఖాధికారుల, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష జరుపుతున్నారు. సింగిల్ విండో విధానంలో అడ్డంకులను అధిగమించి నూరుశాతం అపార్ నమోదుకు అధికారులు, ఉపాధ్యాయులు సంసిద్ధమయ్యారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాల ఏర్పాటు

తల్లిదండ్రులకు వీలుగా ఉండేందుకు మండలాల్లోని పలు పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిద్వారా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఆధార్ లో అప్‌డేట్ చేసినా సవరణకు ఎక్కువ సమయం పడుతోంది.

బిగుసుకుంటున్న ఉచ్చు

- » కాకినాడ జీజీహెచ్ మేనేజర్‌పై కలెక్టర్‌కు చేరిన నివేదిక
- » నేడో, రేపో చర్యలకు అవకాశం

కాకినాడ క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ మేనేజర్ నరసింగరావ్‌కు ఉచ్చుబిగుస్తోంది. కొవిడ్ సమయంలో ఆయన నర్సింగ్ రిక్రూట్‌మెంట్ విషయంలో అవినీతికి పాల్పడ్డానన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగం రాక అన్యాయానికి గురైన ఓ బాధితురాలు కలెక్టర్‌ను ఆశ్రయించింది. అవకతవకల కారణంగా తనకు ఉద్యోగం రాలేదని వాపోయింది. దీంతో అప్పటికే పూర్తయిన విచారణకు కొనసాగింపుగా ఆయువతి ఉదంతాన్ని కూడా విచారణ కమిటీకి అందజేశారు. విచారణ పూర్తి చేసి నివేదికను సోమవారానికి అందజేయాల్సి ఉంది. కానీ, నరసింగరావ్ 2020లో జరిగిన ప్రక్రియ అప్పటి కలెక్టర్‌కు, అధికారులకు తెలిసే జరిగిందని గ్రీవెన్స్‌లో విన్నవించాడు. దీంతో కలెక్టర్ విచారణ కమిటీ వద్దఉన్న నివేదిక త్వరగా నివేదించాలని ఆదేశించగా శుక్రవారమే దాన్ని నివేదించారు. దాన్ని పరిశీలించగా అప్పటి కలెక్టర్ కానీ, అధికారులకు కానీ సంబంధం ఉన్నట్లు రుజువు కాలేదు. ఈ నేపథ్యంలో తదుపరి చర్యలపై కలెక్టర్ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

పిఠాపురం పాదగయలో వైభవంగా జ్యోతిర్లింగార్చన

- » దీపాలు వెలిగించిన భక్తులు
- » శివనామస్మరణతో మార్మోగిన పాదగయ

పిఠాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో ఆదివారం రాత్రి సహస్ర జ్యోతిర్లింగార్చన వైభవంగా జరిగింది. నిత్యాభిషేక భక్తులు, శివభక్తులు, మహిళలు దీపాలంకరణ సేవలో పాలుపంచుకున్నారు. శివలింగం, ఓమ్, స్వస్తిక్, త్రిశూలం తదితర అలంకారాల్లో దీపాలు వెలిగించారు. శివనామస్మరణతో కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం మార్మోగింది.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో దీపాలంకరణ సేవలో భాగంగా దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆయన రచనలు.. నేటికీ సజీవమే!
» మరణించినా.. నినదిస్తున్న కలం తూటాలు 7
» అందరి హృదయాల్లో ప్రతిధ్వనిస్తున్న అక్షరాయుధాలు
» నేడు వజ్రాయుధ కవి ఆవంత్స సోమసుందర్ శత జయంతి



సత్తెమ్మతల్లి ఆలయంలో స్పీకర్ పూజలు

గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారులోని సత్తెమ్మతల్లి ఆలయంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం ప్రత్యేక పూజలు చేయగా ఆయన వెంట టీడీపీ నేతలున్నారు.

బాబాయ్ బాటలోనే నిహారిక

- » గ్రామ పంచాయతీల అభివృద్ధికి రూ.5లక్షల విరాళం
- » కోనసీమ జిల్లాలోని పది పంచాయతీలకు ప్రోత్సాహం
- » సర్పంచ్‌లకు అందజేసిన జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు



సర్పంచ్‌లకు నిహారిక అందించిన నిధుల చెక్కులను అందజేస్తున్న నాగబాబు

పిఠాపురం/గొల్లప్రోలురూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాలనే సంకల్పంతో, గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్న డి ప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బాటలోనే జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు కుమార్తె నిహారిక నడుస్తున్నారు. పది గ్రామ పంచాయతీల అభివృద్ధికి రూ.50వేల చొప్పున రూ.5లక్షల విరాళాన్ని ప్రకటించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్ నివాసంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం మండలం జి.పెదపూడి, ఉడిమూడి, పెదపట్నం, నాగుల్లంక, ఎల్.గన్నవరం, మామిడికుదురు మండలం పాశర్లపూడి, పాశర్లపూడిలంక,అప్పనపల్లి, పెదపట్నం, పెదపట్నంలంక గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు రూ.50వేల చొప్పున నాగబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవాలనే పవన్ సూచనలకు అనుగుణంగా నిహారిక ముందుకు వచ్చారన్నారు. నిహారిక ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు రాగా వాటిని నేరుగా గ్రామ పంచాయతీలకు అందజేయాలని పవన్ సూచించారని చెప్పారు. జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలతో సమావేశం

చేబ్రోలులోని పవన్ నివాసంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, జనసైనికులతో నాగబాబు సమావేశమయ్యారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజల సమస్యలు తదితర అంశాలపై వారితో మాట్లాడారు. కార్యకర్తలు, జనసైనికుల నుంచి వినతులు స్వీకరించారు. పిఠాపురం నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుంచేలా పవన్‌కల్యాణ్ పనిచేస్తున్నారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం ● 18 నవంబరు 2024



హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. భూల్ భులాయా (భూల్ భులాయా3)
3. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
4. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
5. జా రాంఝన్ (దో పత్తీ)
6. ఆయీ నై (స్త్రీ-2)
7. సాజ్‌నీ రే (లా పతా లేడీస్)
8. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
9. అపనా బనాలే (భేడియా)
10. మిలియనీర్ (గ్లోరీ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

సెలబ్ టాక్

దేనికైనా రెడీ..!



బాలీవుడ్‌లోకి మరో వారసురాలు వచ్చింది.
ఆమె ఎవరో కాదు... హీరో వరుణ్ ధావన్ అన్న కూతురు...
'బిన్ని అండ్ ఫ్యామిలీ' కథానాయిక... అంజినీ ధావన్.
వెండితెరపై వెలిగిపోవాలన్న ఆశయంతో... కొన్నేళ్లు
పరిశ్రమలోనే పని చేసి... అనుభవం గడించింది.
తొలి చిత్రంతోనే మంచి హిట్ సొంతం చేసుకోవడమే కాదు...
అగ్ర నటుల ప్రశంసలు కూడా అందుకుంది.

అంజినీ ఇంట్లో అందరూ సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్నవారే. తాతయ్య అనిల్ ధావన్ వెటరన్ నటుడు. ఆయన కుమారుడు, అంజినీ తండ్రి సిద్ధార్థ్ ధావన్ బుల్లితెర నటుడు. హిట్ చిత్రాల దర్శకుడు డేవిడ్ ధావన్ పినతాత. డేవిడ్ తనయుడు, ప్రముఖ హీరో వరుణ్ ధావన్ ఆమెకు వరుసకు బాబాయి. చిన్నప్పటి నుంచీ సినీ వాతావరణంలోనే గడిపిన అంజినీకి సాధారణంగానే నటనపై మక్కువ పెరుగుతూ వచ్చింది. ముంబయిలో పుట్టి పెరిగిన ఆమె... డిగ్రీ తరువాత కెరీర్‌పై పూర్తి శ్రద్ధ పెట్టింది. అయితే కుటుంబ నేపథ్యం, ఇంట్లోవాళ్ల ప్రోత్సాహం ఉన్నా... తొలుత తనను తాను పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని అనుకుంది. ఆ తరువాతే తెర మీద కనిపించాలనే పట్టుదలతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పరిశ్రమలో అడుగుపెట్టింది. వరుణ్ ధావన్ 'కూలీ నంబర్-1'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసింది. అప్పుడప్పుడూ బామ్మ రష్మీ ధావన్ యాక్టింగ్ స్కూల్లోని విద్యార్థులతో కలిసి నటనలో మెళకువలు కూడా నేర్చుకుంది. ఇలా ఎక్కడ అవకాశం దొరికినా దాన్ని ఉపయోగించుకొంటూ... తనలోని నటికి మరిన్ని వన్నెలద్దింది. వీటన్నిటి ఫలితం తొలి చిత్రం 'బిన్ని అండ్ ఫ్యామిలీ'లోనే కనిపించింది. సినిమా చూసినవారందరూ... ఆమెకు అది మొదటి సినిమా అనుకోలేదట. అంతలా అదరగొట్టింది నటనలో. ఇక ఎంతో సహజంగా నటించిందనేది విమర్శకుల మాట.

వేరొక ఆడిషన్‌లో చూసి...

'బిన్ని అండ్ ఫ్యామిలీ'లో అవకాశం కూడా విచిత్రంగా వచ్చింది అంజినీకి. "వేరొక సినిమా కోసం ఏడాదిగా ఆడిషన్లు ఇస్తున్నా. అది సంజయ్ త్రిపాఠీ దృష్టిలో పడింది. తను తీయబోయే చిత్రంలో 'బిన్ని' పాత్రకు నేనైతే సరిగ్గా సరిపోతానని ఆయన భావించారట. వెంటనే నన్ను ఆడిషన్స్‌కు పిలిచారు. నా నటన నచ్చింది. అలా 'బిన్ని అండ్ ఫ్యామిలీ'లో అవకాశం రావడమే కాదు... నటిగా నా కెరీర్ కూడా ప్రారంభమైంది" అంటూ ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది అంజినీ.



'నా జీవితానికి దగ్గరైన పాత్ర'...

ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలను లండన్‌లో చిత్రీకరించాడు సంజయ్. నెల రోజులపాటు సాగిన ఆ షెడ్యూల్‌లో 'పంకజ్ కపూర్, హిమని శివ్‌పురి, రాజేష్‌కుమార్ లాంటి సీనియర్లతో కలిసి పని చేయడంవల్ల ఎంతో నేర్చుకొనే అవకాశం లభించింది. అంతా ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారు. నెల రోజులూ ఎంతో సరదాగా గడిచిపోయాయి. అదీకాకుండా 'బిన్ని' పాత్ర నిజ జీవితంలో నాకు చాలా దగ్గరగా ఉంటుంది. కొన్ని సన్నివేశాలు చేస్తున్నప్పుడు, ముఖ్యంగా బామ్మ పాత్రధారి నా చిరిగినట్టుండే ఫ్యాషన్ జీన్స్ చూసి ఇదేంటని ప్రశ్నించినప్పుడు మా నాన్న గుర్తుకువచ్చారు. ఆయన కూడా ఇంట్లో నా డ్రెస్‌లు చూసి జోకులు వేసేవారు' అంటూ తన అనుభవాలు పంచుకుంది అంజినీ. డేవిడ్, వరుణ్ ధావన్ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటారు. ముఖ్యంగా ఈ చిత్రం ప్రచార కార్యక్రమాల్లోనే కాకుండా, షూటింగ్ సమయంలో కూడా వరుణ్ అంజినీకి మద్దతుగా నిలిచాడు. తన ఇన్‌స్టా, ఎక్స్ ఖాతాల్లో ఆమె గురించి, ఆమె చిత్రం గురించిన విశేషాలను పంచుకున్నాడు. సినిమా విడుదల తరువాత కూడా అంజినీని ప్రత్యేకంగా అభినందించాడు.

నిరూపించుకొంటేనే...

"నా సినిమా విడుదలకు ముందు కొందరు 'బాలీవుడ్‌లో బంధుప్రీతికి మరో నిదర్శనం' అంటూ కించపరిచేలా నాపై వ్యాఖ్యలు చేశారు. పరిశ్రమలో పరిచయాలవల్ల కష్టపడకుండానే మొదట్లో ఒకటి రెండు అవకాశాలు వస్తాయేమో! కానీ మనలో సామర్థ్యం లేకపోతే ఇక్కడే కాదు, ఏ రంగంలోనూ నిలదొక్కుకోలేము. మనల్ని మనం నిరూపించుకొంటేనే మనుగడ. నటిగా తెరమీద కనిపించడానికి ముందు సినీ నిర్మాణంలో ప్రతి క్రాఫ్ట్ గురించీ తెలుసుకోవాలని అనుకున్నాను. అందుకే తొలుత బాబాయి సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. షూటింగ్ స్పాట్‌కు ఉదయాన్నే వెళ్లిపోయేదాన్ని. కెమెరా, లైటింగ్, లోకేషన్లు... ఇలా అన్నిటి మీద ఒక అవగాహన వచ్చాకనే నటన గురించి ఆలోచించాను" అంటుంది అంజినీ.

మంచి స్నేహితులు...

'కూలీ నంబర్-1' షూటింగ్‌లో వరుణ్, ఆ చిత్ర కథానాయిక సారా అలీఖాన్‌తో ఎంతో సరదాగా గడిచిపోయేదని, తారలపై వచ్చే గాసిప్స్ మీద మాట్లాడుకొని నవ్వుకొనేవారమని చెప్పింది ఇరవై నాలుగేళ్ల అంజినీ. 'వరుణ్‌ను ఎప్పుడూ బాబాయిగా చూడలేదు. అన్నయ్యలాగా భావిస్తాను. తను నన్ను ఎంతో గారాబంగా చూసుకొంటాడు' అంటున్న అంజినీకి సంజయ్ కపూర్ కుమార్తె, నటి షనయ కపూర్, బోనీ- శ్రీదేవిల చిన్న కూతురు ఖుషీ కపూర్ మంచి మిత్రులు. 'నా సినిమా ప్రీవ్యూ నుంచి బయటకు వచ్చేటప్పుడు వాళ్ల కళ్లు చమర్చాయి. నా నటన బాగుందని అభినందించారు' అంటూ తన ఆనందాన్ని పంచుకుంది అంజినీ.

అన్నీ చెయ్యాలి...

మొదటి చిత్రంతోనే మంచి నటిగా ప్రశంసలు అందుకున్న అంజినీ... భవిష్యత్తులో అన్ని రకాల పాత్రలూ చేయాలని అనుకొంటోంది. 'యాక్షన్, కామెడీ, ప్రేమ కథలు, సైకో థ్రిల్లర్లు అనే తేడా లేకుండా ప్రతి పాత్రా పోషించాలి. విలక్షణ నటిగా ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలి'.. అని కోరుకొంటున్న అంజినీ ఏ పాత్రకైనా రెడీ అంటోంది. ఆమెకు ఇన్‌స్టాలో ఫాలోవర్స్ కూడా తక్కువేంలేరు. ఫ్యాషన్ ఐకాన్‌గా తెరంగేట్రానికి ముందే లక్షలమంది అభిమానులను సంపాదించుకున్న ఆమె.. తరచూ వెరైటీ డ్రెస్సుల్లో ఫొటోలు అప్‌లోడ్ చేస్తుంటుంది. వాటికి లైక్‌లూ లక్షల్లోనే. ఫిట్‌గా ఉండటానికి యోగా, జిమ్నాస్టిక్స్‌ను తన దినచర్యల్లో భాగంగా చేసుకుంది.

నవ్య | చిత్రజ్యోతి

ఆ స్వేచ్ఛ మాకూ ఉంది

- విష్వక్‌సేన్

'ఒక సినిమా బాగోగుల గురించి విమర్శకులు, సమీక్షకులు ఎంతటి విశ్లేషణ అయినా చేయవచ్చు కానీ ఆ వంకతో వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా ఉండకూడదు. మీలాగా మాకూ భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని గుర్తుంచుకోవాలి' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ కథా



నాయికలు. రామ్ తాళ్లూరి నిర్మాత. ఈ నెల 22న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆది వారం వరంగల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వ హించారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ "మెకానిక్ రాకీతో మా నిర్మాత రామ్ గర్వపడేలా చేస్తా. పది సినిమాల అనుభవంతో చెబుతున్నా మంచి సినిమా తీశాం. ఐదు నిమిషాలు కూడా బోర్‌కొ ట్టదు. మా సినిమాను ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు. రామ్ తాళ్లూరి మాట్లాడుతూ 'విష్వక్‌సేన్ కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలున్నాయి. మీ అందరికీ నచ్చు తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. యువతను, మాస్ ప్రేక్ష కులను ఆకట్టుకునే అంశాలతో తెరకె క్కిన చిత్రమిదని మీనాక్షి చౌదరి తెలిపారు. సందేశం, వినోదం కలబో తగా రూపొందిన చిత్రమిదని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పారు.

కొత్తగా...

రిమాండ్‌కు కస్తూరి



తమిళ నాడులో నివసిస్తున్న తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో నటి కస్తూరికి ఎగ్మోర్ మెట్రోపాలిటన్ కోర్టు 12 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆమెను పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. 'అధికార దుర్వినియోగాన్ని ముగింపు పలికి న్యాయాన్ని గెలిపించాల'ని కోర్టు వెలుపల కస్తూరి మీడియాతో అన్నారు. మధురై కోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో హైద రాబాద్‌లో తలదాచుకున్న కస్తూరిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకొని తమిళనాడుకు తరలించిన విషయం తెలిసిందే.



పట్నాలో పుష్ప రూల్

'నేను మొదటిసారి బిహార్‌కు వచ్చాను. నా హిందీ అంత బావుండదు. తప్పులు మాట్లాడితే క్షమించండి. ఎవరికీ తలవంచని పుష్ప నేడు మీ ముందు తలవంచుతు న్నాడు. మీ అభిమానమే 'పుష్ప 2: ది రూల్' లాంటి మంచి చిత్రాన్ని తీయడానికి మాకు ప్రేరణ' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పుష్ప 2'. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని బిహార్ రాజధాని పట్నాలో భారీ జనసందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ "పుష్ప' చిత్రాన్ని పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఆ సినిమా సూపర్‌హిట్ అయ్యిందంటే ఆ గొప్పదనం నాది కాదు, ప్రేక్షకులదే. మీ ప్రేమే 'పుష్ప 2: ది రూల్' చిత్రాన్ని ఇంత గొప్పగా తీయడానికి కారణమైంది. డిసెంబర్ 5న మీ ముందుకు రాబోతోంది. తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది. మీ సమక్షంలో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'ఇంతమంది అభిమానులు 'పుష్ప' ప్రపంచంలోకి వచ్చినందుకు నాకు సంతోషంగా ఉంది. రెండు సంవత్సరాలుగా అభిమానులు ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. మీ అందరి అంచనాలకు మించి సినిమా ఉండబో తోంది' అని తెలిపారు. 'పట్నా ప్రజల నుంచి ఈ స్థాయి ఆదరణను ఊహించలేదు. ఈ గొప్పదనం అల్లు అర్జున్, సుకుమార్‌కు దక్కుతుంది' అని నిర్మాత యలమంచిలి రవి, నవీ న్ యెర్నేని తెలిపారు. 'పుష్ప 2' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం భారీ ఎన్నికల ప్రచార సభను తలపించింది. దేశవ్యాప్తంగా ఉన్న అల్లు అర్జున్ అభిమానులు తరలివ చ్చారు. గాంధీ మైదానం జనాలతో కిటకిటలాడిపోయింది. ఈ కార్యక్రమానికి సుమారు రెండు లక్షలమంది హాజరయ్యారని అంచనా. "పుష్ప అంటే ఫైర్ కాదు వైల్డ్ ఫైర్' అంటూ ఆయన చెప్పిన డైలాగ్‌లకు అభిమానుల కేరింతలతో సభాప్రాంగణం మార్మోగింది. బిహార్ డిప్యూటీ సీఎం విజయ్ సేన సాహెబ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశుపాలకుడిగా ప్రణవ్



వెండితెరపైన సాదా సీదా పాత్రలను అద్భుతంగా పోషించే తారలు నిజ జీవితంలో అలా జీవించగలరా? అంటే 'కష్టమే' అని చెప్పాలి. కానీ మలయాళ మెగా స్టార్ మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ మాత్రం స్టార్‌డమ్‌ను పక్కన పెట్టి దేశం కాని దేశంలో అనామకంగా జీవిస్తున్నాడు. ప్రస్తుతం స్పెయిన్‌లో 'వర్క్ అవే' అనే కార్యక్రమంలో భాగంగా ఆయన ఓ పొలంలో కష్టపడి పనిచేస్తున్నారు. పశుపాలకుడిగా గొర్రెలు, మేకలు, గుర్రాలను కాస్తున్నారు ప్రణవ్. నటుడిగా పోషించాల్సిన విభిన్న పాత్రల్ని తన కొడుకు నిజజీవితంలో పోషిస్తున్నారని ప్రణవ్ తల్లి సుచిత్ర ఓ ఇంటర్వ్యూలో చెప్పడంతో ఈ విషయం అందరికీ తెలిసింది. ఒక సూపర్‌స్టార్‌కి కొడుకు, ఆగర్భ శ్రీమంతుడు అయినా విలాసవంతమైన జీవన శైలిని వదిలి ఇలా సాదాసీదాగా గడుపుతున్న ప్రణవ్‌ను నెటిజన్లు అభినందిస్తున్నారు. 2002లో 'ఒన్నమన్' అనే సినిమాతో బాలనటుడిగా అరంగేట్రం చేసిన ప్రణవ్.. 'పునర్జనీ' చిత్రంతో ఉత్తమ బాలనటుడిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డు అందుకున్నారు. 2018లో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో 'ఆది' అనే చిత్రంతో హీరోగా పరిచయమయ్యారు. ఈ సినిమా ఆ ఏడాది అత్యధిక వసూళ్లు అందుకున్న చిత్రంగా నిలవడమే కాకుండా ప్రణవ్‌కు ఉత్తమ నటుడిగా సైమా అవార్డునూ తెచ్చిపెట్టింది. ప్రణవ్ కేవలం నటుడిగానే కాకుండా ప్లేబ్యాక్ సింగర్‌గా, పాటల రచయితగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు.

గాయకుడు అనురాగ్ కులకర్ణి, గాయని రమ్య బెహర వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ వేడుకకి సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరలవుతున్నాయి. కొద్దిమంది కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి చిన్న కుమారుడు శ్రీ సింహా, సీనియర్ నటుడు మురళీ మోహన్ మనవరాలు రాగ వివాహం త్వరలోనే జరగనుంది. ఆదివారం గోల్కొండ రిసార్ట్స్‌లో ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ వేడుకలో ఆంధ్రజ్యోతి గ్రూప్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

రూ. పదికోట్ల వీడియో ఫ్రీగా చూడండి





నటి నయనతార బయోపిక్‌గా నెట్‌ఫ్లిక్స్ తెరకెక్కించిన డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్'. దీనికోసం 'నానుమ్ రౌడీ దాన్' సినిమా సమయంలో షూట్ చేసిన మూడు సెకన్ల క్లిప్‌ను వాడుకున్నందుకు రూ.పది కోట్లు ఇవ్వాలని నటుడు, నిర్మాత ధనుష్ కోరారని.. ఇందుకు ఆయనని విమర్శిస్తూ నయనతార ఓ బహిరంగ లేఖ రాసిన సంగతి తెలిసిందే. అయితే నయనతారను సపోర్ట్ చేస్తూ ఆదివారం ఆమె భర్త విఘ్నేష్ శివన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రెండు పోస్టులు పెట్టారు. అందులో ఒక దాంట్లో.."కేవలం మూడు సెకన్లకు ధనుశ్ రూ.పది కోట్లు డిమాండ్ చేసిన వీడియో ఇదే. మీరంతా ఫ్రీగా చూసేయ్యండి" అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. అంత టితో ఆగకుండా... మరో పోస్ట్‌లో.. 2017లో 'సక్క పోడు పోడు రాజా' సినిమా ఆడియో ఫంక్షన్‌లో ధనుశ్ మాట్లాడిన వీడియోను కూడా షేర్ చేశారు. అందులో ప్రేమను పంచడం గురించి.. నటీనటులు పనిచేసే చోట ఉండాల్సిన వాతావరణం గురించి ధనుశ్ మాట్లాడారు. ఆ వీడియోకి కౌంటర్‌గా "జీవించండి.. ఇతరులని స్వేచ్ఛగా జీవించనివ్వండి. ప్రేమను పంచండి.. ఓం నమః శివాయ. మీరు చెప్పినవి ముందు మీరు పాటించండి. కనీసం మీ అభిమానుల కోసమైనా" అని పేర్కొన్నారు. అయితే ఈ పోస్టులను కొద్దిసేపటికే విఘ్నేష్ శివన్ తొలగించడం గమనార్హం. మరోవైపు గాయని సుచిత్ర, ధనుశ్ ఎంతో మంది హీరోయిన్లను వేధించారని ఆరోపించారు.


పాపికొండల విహారయాత్రకు వెళుతున్న పర్యాటక బోటు

పాపికొండలకు పోటెత్తిన పర్యాటకులు

దేవీపట్నం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పాపికొండలు విహారయాత్రకు పర్యాటకుల రద్దీ పెరిగింది. కార్తీకమాసం సందర్భంగా పేరంటాలపల్లిలో ఉన్న శివుడిని దర్శించుకునేందుకు పర్యాటకులు ఇరురాష్ట్రాల నుంచి ఆదివారం భారీగా తరలివచ్చారు. 12 బోట్లలో సుమారు 800 మంది పర్యాటకులు గోదావరి పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, మంటూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పాపికొండలు వెళ్లారు. మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి దర్శనం అనంతరం పోశమ్మగండి బోటుపాయింట్ నుంచి వెళ్లారు. అలాగే పాపికొండలు విహారయాత్రకు వెళ్లే పర్యాటకులు మద్యం తీసుకెళ్లరాదని దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ అన్నారు.


రాయవరం నుంచి శ్రీశైలం పాదయాత్ర చేస్తున్న శివస్వాములు.

రాయవరం నుంచి శివస్వాముల శ్రీశైలం పాదయాత్ర

రాయవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని శివమాల ధరించిన ముగ్గురు శివస్వాములు ఆదివారం రాయవరం అన్నపూర్ణ సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం నుంచి శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. గ్రామానికి చెందిన గుడాల సూరిబాబు గురుస్వామితోపాటు మరో ఇద్దరు శివస్వాములు రాయవరం నుంచి బయలుదేరి శ్రీశైలం బయలుదేరారు. 12 రోజులపాటు యాత్ర సాగుతుందని గుడాల సూరిబాబు శివస్వామి తెలిపారు. రాయవరం నుంచి పాదయాత్రగా బయలుదేరిన శివస్వాములకు గ్రామంలో శివస్వాములు గ్రామశివారు వరకు భక్తిగీతాలు ఆలపిస్తూ వెళ్లి వీడ్కోలు పలికారు. తొలుతగా శివస్వాములు శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు

కరుణించవయ్యా సత్యదేవా!

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

● రూ.70లక్షల ఆదాయం


స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచియున్న భక్తులు

అన్నవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి కార్తీక మాసం, ఆదివారం సెలవుదినం కావడంతో అశేష భక్తజనంతో పోటెత్తింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని శనివారంరాత్రి ఒంటిగంట నుంచి వ్రతాలు, రెండుగంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. ఉదయం 8గంటల వరకు సాధారణంగా ఉన్న రద్దీ 8తరువాత ఊహించని రీతిలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం ఒక్కరోజు సుమారు 8వేల జంటలు స్వామివారి వ్రతమాచరించగా వివిధ విభాగాల ద్వారా రూ.70లక్షల ఆదాయం లభించింది. ఈవో రామచంద్రమోహన్ రద్దీ తగ్గేవరకు క్యూలైన్లవద్ద ఉండి పర్యవేక్షించారు. వ్రతంటిక్కెట్లు తీసుకున్న భక్తులను కంపార్ట్‌మెంట్‌లలో ఉంచి వ్రతమండపాలు ఖాళీ అయ్యాక వ్రతం భక్తులను అనుమతిస్తుండడంతో క్యూలైన్లన్నీ సాఫీగా జరుగుతున్నాయి. సుమారు 70వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అంత్రాలయం, యంత్రాలయ దర్శనాలు నిలుపుదల చేశారు.

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు


అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో భక్తుల రద్దీ

అయినవిల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తడంతో ఆలయం కిటకిటలాడింది. వేకువజామునే స్వామివారికి అభిషేకాలు పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. లక్ష్మీగణపతి హోమం, లఘున్యాసాలు జరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ మండపాలు భక్తులతో కిక్కిరిశాయి. స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో గంటల కొలదీ భక్తులు బారులు తీరారు. ఆలయ సహాయ కమిషనర్, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక దర్శనాలు రద్దుచేసి భక్తులందరికీ ఉచిత దర్శనం కల్పించారు. కార్తీకమాసం ఆదివారం కావడంతో అయినవిల్లి సిద్ధివినాయక దేవస్థానం వద్ద భక్తులు, వాహనాల రద్దీతో ట్రాఫిక్ స్తంభించింది. ముక్తేశ్వరం సెంటర్ వద్ద కూడా భక్తులు వాహనాలతో రద్దీ నెలకొంది.

మధుచందనకు మరో బంగారు పతకం

చింతూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో గుత్తుల మధుచందన మరో బంగారు పతకం సొంతం చేసుకుంది. దీంతో మధు చందన కైవసం చేసుకున్న పతకాల సంఖ్య 38కి చేరాయి. గుడివాడ ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో శని, ఆదివారం రెండు రోజులపాటు వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. 2024-25 నాటి అండర్-19 విభాగంలో +87 కేటగిరి 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌లో మధుచందన పోటీపడింది. ఈ క్రమంలో మధు చందన బంగారు పతకం సొంతం చేసుకుంది. చింతూరుకు చెందిన మధు చందన స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ పోటీల లో మదుచందన బంగారు పతకం కైవసం చేసుకోవడంతో డిసెంబరు 9 నుంచి 15వరకు ఢిల్లీలో జరగబోయే 68వ జాతీయ స్కూల్‌గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ 2024-25 నాటి పోటీలకు అర్హత సాధించారు. వరుస పతకాలు సాధిస్తున్న మదుచందనకు ఆమెకు శిక్షణ ఇస్తున్న గోలి గంగాధర్‌కు పలువురు అభినందనలు తెలిపారు.


బంగారు పతకంతో మధుచందన

ఆయన రచనలు.. నేటికీ సజీవమే!

» మరణించినా.. నినదిస్తున్న కలం తూటాలు

» అందరి హృదయాల్లో ప్రతిధ్వనిస్తున్న అక్షరాయుధాలు

» నేడు వజ్రాయుధ కవి ఆవంత్స సోమసుందర్ శత జయంతి

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

'రండి రండి ఉక్కుముక్కు కాకుల్లారా
రండర్రా గద్దల్లారా రండి రండి
సమరంలో క్షతగాత్రుడనై పడిపోయిన

నా శరీరాన్ని తినివేయండి..' అంటూ సోమసుందర్ క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అరెస్టయి లాకప్‌లో పోలీసు లాఠీ దెబ్బలకు విలవిల్లాడుతున్న సమయంలో ఉరిమిన కలం నుంచి వెలువడడం ప్రారంభించిన మాటల తూటాలు, అక్షరాయుధాలు నేటికీ అందరి హృదయాల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. తెలంగాణా సాయుధ పోరాటం సమయంలోను కలంతో నినదించిన 'వజ్రాయుధ' కవి, విమర్శకుడు, సమీక్షకుడు, అనువాదకుడు, కథా రచయిత, పత్రికా సంపాదకుడు అక్షరతపస్వి, అభ్యుదయవాది డాక్టర్ ఆవంత్స సోమసుందర్ శతజయంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

1924, నవంబరు 18న తూర్పుగోదావరి జిల్లా శంఖవరంలో కాశ్లూరి సూర్యప్రకాశరావు, వెంకాయమ్మ దంపతులకు జన్మించారు. 1929లో పిఠాపురంలోని పినతల్లి ఆవంత్స చిట్టి వెంకాయమ్మ, వెంకట్రావు దత్తత తీసుకున్నారు. దీంతో ఇంటి పేరు మారి ఆవంత్స సోమసుందర్ అయ్యారు. దత్తత తల్లి వెంకాయ్యమ్మకు సాహిత్యంపై ఉన్న ఆసక్తి సోమసుందర్‌కు కలిగింది. 13వ ఏటనే కవిత్వ రచన చేసేలా ఉరికొల్పింది. ప్రాథమిక విద్య పిఠాపురంలోనూ, ఉన్నత విద్యను కాకినాడ పీఆర్ కళాశాలలోనూ చదివారు.

వజ్రాయుధాలు సంధించారు ఇలా..

స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా జరిగిన పోరాటాల్లో సోమసుందర్ చురుగ్గా పాల్గొన్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టయి, తుని సబ్‌జైలులో జైలుశిక్ష అనుభవించారు. జైలులో ఉన్న సమయంలోనే ఆయన అభ్యుదయ కవిత్వం వైపు మరలారు. అక్కడే వజ్రాయుధానికి బీజం పడింది. 1944 నుంచి 48 వరకూ రాసిన కవితలను ఎంపిక చేసి 1949, మార్చిలో వజ్రాయుధాన్ని ముద్రించారు. సమాజంలో ఉద్రిక్తతలు రెచ్చగొడుతుందంటూ 1950, ఫిబ్రవరి 6న అప్పటి ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం వజ్రాయుధాన్ని నిషేధించింది. 1956లో నిషేధాన్ని ఎత్తివేశారు. దీన్ని హిందీ, మరాఠీ భాషల్లో అనువదించారు. ఆరోగ్యం సహకరించకున్నా, ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా 2016, ఆగస్టు 12న మరణించే వరకూ సోమసుందర్ కలం ఆగలేదు. 125కి పైగా గ్రంథాలు, కథానికలు రచించారు. వీటిల్లో గోదావరి జలప్రళయం, కాగళి, వెన్నెల్లో కోనసీమ, మా ఊరు మారింది, జీవనలిపి, అరుపర్తి తదితరాలు ప్రాచుర్యం పొందాయి. ఆంధ్రరాష్ట్ర ఉద్యమ సమయంలో రాసిన కాహళితోపాటు విజ్ఞానశాస్త్ర, యాత్రాస్థలాలు సందర్శన నేపథ్యాల్లోను, విమర్శనా గ్రంథాలుగా, అనువాదం గ్రంథాలుగా అనేకం రచించారు. కలలు-కన్నీళ్లు పేరిట ఆత్మకథను రాసుకున్నారు. అనారోగ్యానికి గురైనా సహాయకుల సహకారంతో రచనలు కొనసాగించారు. కవులపై రాసిన వ్యాసాలతో కూడిన శరచ్చంద్రిక పుస్తకాన్ని రచించి అప్పటి రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ షష్టిపూర్తి సందర్భంగా బహుమతిగా అందజేశారు. ఇదే ఆయన చివరి రచన.

పరిచయం లేకున్నా అభినందనలకు ముందు

తాను ప్రఖ్యాత కవి, విమర్శకుడు అనే గర్వం ఏనాడు సోమసుందర్‌కు ఉండేది కాదు. ఎవరి రచనలు అ యినా బాగున్నప్పుడు వారు తన కు పరిచయం లేకున్నా అభినందించడం లో ముందుండేవారు. తన తోటి సాహితీ వేత్తలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2001లో సోమసుందర్ లిటరరీ ట్రస్టు ప్రారంభించి ఏటా పురస్కారా లు అందజేస్తూ వచ్చారు. తనకు లభించిన పురస్కారాల ద్వారా వచ్చిన నగదు, తన పేరు న ఉన్న ఆస్తులను అమ్మి ఈ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. ప్రతిఏటా ఆయా రంగాల్లో ప్రముఖులకు డాక్టర్ ఆవంత్స సోమసుందర్ సాహిత్య పురస్కారం, రాజహంస కృష్ణశాస్త్రి పురస్కా రం, రాంషా స్మారక విమర్శక పురస్కారం, గురజాడ కథాప్రభాస పురస్కారాలను ప్రముఖులకు అందజేశారు. తాను మరణించిన తర్వాత ట్రస్టు నిరతంరం కొనసాగాలన్న తపనతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు.



పురస్కారాల వెల్లువ

సోమసుందర్‌కు పురస్కారాలు, అవార్డులు, సత్కారాలు లభించాయి. 1979లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సోవియెట్ ల్యాండ్ నెహ్రూ బహుమతిని, 2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా ఆత్మగౌరవ పురస్కారం లభించింది. ఇదే గాక 2008లో ఎన్టీఆర్ జాతీయ స్మారక అవార్డు, రాజ్యలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, రాజారామ్ సాహితి పురస్కారం, కళారత్న పురస్కారం, లోక్‌నాయక్ పురస్కారం, గురజాడ 150వ జన్మదిన పురస్కారం, విశాలాంధ్ర విశిష్ట సత్కారాలు పొందగా, పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, గౌరవ డాక్టరేట్ పొందారు.


డాక్టర్ ఆవంత్స సోమసుందర్

మా సో.సు అంటారు..

సోమసుందర్ అభిమానులు, స్నేహితులు, పరిచయస్తులు ఆయనను అభిమానంగా సో.సు అని పిలుచుకుంటారు. ఆయన అభిమానంగా తిట్లు తిడితే వాటిని వారు దీవెనలుగా భావించేవారు. సోమసుందర్ తాను మరణించిన తర్వాత తన పార్థీవదేహాన్ని రంగరాయ మెడికల్ కళాశాలకు అందివ్వాలని కోరి అందరికీ ఆదర్శంగా నిలిచారు. కుటుంబసభ్యులు ఆయన కోరికను అమలు చేశారు. ఆయన మరణించి ఎనిమిదేళ్లు దాటుతున్నా సో.సు మాత్రం అందరి హృదయాల్లో చిరస్థాయిగా గూడు కట్టుకునే ఉన్నారు. శత జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటున్నారు.

లోవ తలుపులమ్మ ఆదాయం రూ.1.91లక్షలు



తుని రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానం ఆదివారం భక్తుల కోలాహలంగా మారింది. పవిత్ర కార్తీక మాసం పర్వదినాలు కావడంతో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి అమ్మవారి దర్శనార్థం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అమ్మవారిని సర్వాంగత సుందరంగా అలంకరించిన అర్చక స్వాములు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం ఒక్కరోజే 10వేల మంది పైబడి భక్తులు దర్శించుకోగా ఆలయానికి రూ.1.91లక్షల ఆదాయం సమకూరింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులుప్రత్యేక ఏరాట్లు చేయగా రూరల్ పోలీసులు లోవ ప్రాంగణం లో బందోబస్తు ఏర్పాటుచేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలు చేపట్టారు.

పాదగయలో జడ్పీ సీఈవో పూజలు

పిఠాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని ఉమ్మడి విశాఖ జిల్లాపరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి ఆదివారం సాయంత్రం సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వర, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను సతీసమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. సీఈవో దంపతులకు వేదపండితులు ఆశీర్వచనాలు పలకగా, ఆలయ అధికారులు ప్రసాదాలు అందజేశారు.


పిఠాపురం పాదగయ క్షేత్రంలో విశాఖ జడ్పీ సీఈవో నారాయణమూర్తి

బాలబాలాజీ దేవస్థానంలో భక్తుల కోలాహలం

మామిడికుదురు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం ఆదివారం భక్తుల కోలాహలంతో కళకళ్లాడింది. కార్తీకమాసం ఆదివారం కావడంతో అధికసంఖ్యలో స్వామివారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. వైనతేయనదిలో స్నానమాచరించి దేవస్థానంలో నిర్వహించే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆదివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాలద్వారా రూ.4,35, 067 ఆదాయం వచ్చిందని సహాయకమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శివుని చెంత మందుబాబుల చిందులు


పూతిగుంట జలపాతాల వద చిందులు వేస్తున్న మందుబాబులు

వై.రామవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పరమ పవిత్రమైన శివాలయం చెంతనే మందుబాబులు మందుకొడుతూ విహారయాత్రికులను, అయ్యప్పభక్తులను హడలెత్తించిన సంఘటన ఆదివారం అల్లూరి జిల్లా వై.రామవరం మండలం పరిధిలోని పూతిగుంట శివాలయం వద్ద చోటుచేసుకుంది. పూతిగుంటకు సమీపంలోనే చవిటిదిబ్బలలో బ్రాందీషాపు ఉంది. కార్తీకమాసం సందర్భంగా పలు ప్రాంతాల నుంచి పూతిగుంట శివాలయానికి విహారయాత్రికులతోపాటు భవానీ, అయ్యప్పమాలదారు లు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఇదే సమయంలో ఆదివారం కొందరు మందుబాబులు ఇక్కడికి వచ్చి జలపాతాల వద్ద మందుకొడుతూ చిందులు వేస్తూ కేకలు వేయడంతో భక్తులు భయభ్రాంతులకు గురవుతూ ఆందోళన చెందారు.

వలస ఆదివాసీల సమస్యను పరిష్కరించండి


కేంద్ర గిరిజన శాఖ మంత్రి జ్యూరల్ ఓరాంని సన్మానిస్తున్న ఆదివాసీ వికాస సంఘం నాయకుడు పొడియం ధన బృందం

చింతూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చి తెలుగు రాష్ట్రాలలో జీవిస్తున్న వలస ఆదివాసీల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ వికాస సంఘ నాయకుడు పొడియం ధన కోరారు. ఈ మేరకు తమ బృందం ఆదివారం ఢిల్లీలో స్వర్ణ జయంతి ఆడిటోరియంలో కేంద్ర గిరిజనశాఖ మంత్రి జ్యూరల్ ఓరాంని కలసి వినతి పత్రం ఇచ్చినట్లు ఆంధ్రజ్యోతికి పొడియం ధన తెలిపారు. వలస ఆదివాసీల సంతతికి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో ఉన్నత చదువులకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. భారతీయులైన వలస ఆదివాసీలు తెలుగు రాష్ట్రాలలో ద్వితీయ శ్రేణి పౌరులుగా జీవించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వలస ఆదివాసీల సమస్యలు తెలుసుకున్న కేంద్రమంత్రి జ్యూరల్ ఓరాం ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని తమకు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా వలస ఆదివాసీల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేసిన పులుగుజ్జు సురేష్‌కు గిరిజన శాఖ మంత్రి చేతుల మీదుగా బిర్సా ముండా జాతీయ అవార్డు ప్రదానం చేశారన్నారు. లిబ్టు డైరెక్టర్ ఏసురత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

కాకినాడ అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరుగుతున్న 68వ రాష్ట్రస్థాయి అండర్-19 హాకీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం రెండోరోజు హోరాహోరీగా సాగాయి. పలు జిల్లాల మధ్య పోటీ ఉత్కంఠభరితంగా జరిగింది. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విజేతలను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పాఠశాలల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు.

రెండోరోజు సెమీఫైనల్స్‌లో విజేతలు

బాలికల విభాగంలో విశాఖపై అనంతపురం 3.1 తేడాతో విజయం సాధించింది. వైఎస్ఆర్ కడప జిల్లా జట్టుపై తూర్పుగోదావరి జట్టు 3.0తేడాతో గెలిచింది. సోమవారం ఫైనల్స్‌లో మొదటి మ్యాచ్‌లోతూర్పు, అనంతపురం తలపడనున్నాయి. విశాఖ, వైఎస్ఆర్ కడపజట్టు పోటీ పడనున్నాయి. బాలుర విభాగంలో సెమీఫైనల్స్‌లో కడపపై తూర్పుగోదావరిజట్టు 4.0 స్కోర్‌తో విజయం సాధించింది. అనంతపురంపై విశాఖ 7.2తేడాతో విజయం సాధించింది. సోమవారం ఫైనల్స్‌లో కడప, అనంతపురం జట్లు మొదటిమ్యాచ్‌లో విశాఖ, తూర్పుగోదావరి మూడోమ్యాచ్‌లో తలపడనున్నాయి.


రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

అవును.. నిజంగా తాను అదృష్టవంతుడినే..

● శెట్టిబలిజ కార్తీక వన సమారాధనలో మంత్రి సుభాష్

కాకినాడ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అవును.. నిజంగా తాను అదృష్టవంతుడినేనని, పార్టీ కోసం తానుచేసిన కృషిని, కష్టాన్ని గుర్తించి స్వర్ణాంధ్ర సృష్టికర్త చంద్రబాబు, డైనమిక్ నేత పవన్ కళ్యాణ్, యువ నాయకుడు నారాలోకేష్ తనకు టిక్కెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా, మంత్రిగా అవకాశం కల్పించారని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో కాకినాడజిల్లా శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సుభాష్ మా ట్లాడుతూ తాను రాజకీయాలకు కొత్త ఏమోగాని, సేవా కార్యక్రమాలకు కొత్త కాదన్నారు. శెట్టిబలిజ జాతి ఐక్యతకు, అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. బీసీల సంక్షేమంకోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.39 వేల కోట్లు కేటాయించిందన్నారు. గీత కార్మికులను ఆదుకునేందుకు 10శాతం లిక్కర్ షాపులు కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబులు మాట్లాడుతూ ఆర్థిక రాజకీయ పరిపుష్టి ఉంటేనే నేటి ఆధునిక యుగంలో రాణించగలమన్నారు. అనంతరం మంత్రి సుభాష్‌ను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ నాయకులు చొల్లంగి వేణుగోపాల్, వాసంశెట్టి రాజేశ్వరరావు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, పొమ్మి బాలాజీ, యనమదల రవి, పెంకే శ్రీనివాసబాబా, గుబ్బల తులసికుమార్, పెంకే సత్తిబాబు, పెద్దింశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తుల శ్రీనివాస్, మేడిశెట్టి చిన్ని, దొడ్డి వీరేంద్ర, కడలి ఈశ్వరి, కుడుపూడి వెంకటలక్ష్మి, రాయుడు దుర్గ, పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

అదుపుతప్పిన ద్విచక్రవాహనం

● విద్యుత్ దిమ్మను ఢీకొని వ్యక్తి మృతి

కాకినాడక్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ద్విచక్రవాహనం అదుపు తప్పి ఎలక్ట్రిక్ పోల్ దిమ్మను ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పశ్చిమగోదావరిజిల్లా పోడూరుకు చెందిన బెల్లాని సుదర్శన్(40) వివాహితుడు. భార్యతో విడాకులు కావడంతో మూడేళ్లుగా కాకినాడ జగన్నాథపురం ఘాటీ సెంటర్‌లోని తన అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం బయటకు వెళ్లొస్తానని ఇంటి వద్ద చెప్పి బైక్‌పై బయలుదేరాడు. ఎన్టీఆర్ వారధిపై నుంచి వార్ఫు రోడ్డువైపు తిరుగుతుండగా అదుపుతప్పి వంతెన ప్లాట్‌ఫాంపైన ఉన్న ఎలక్ట్రిక్ పోల్ దిమ్మను బలంగా ఢీకొట్టాడు. దీంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన బెల్లాని సుదర్శన్

దొంగతనం నెపంతో కొడవలితో దాడి

● టీడీపీ కార్యకర్తపై హత్యాయత్నం

ఎటపాక, నవంబరు17(ఆంధ్రజ్యోతి): తనపై తరచూ దొంగతనం నెపం వేస్తున్నాడని, ఆవేశంతో ములకల నాగరాజు అనే వ్యక్తి టీడీపీ సీనియర్ కార్యకర్తపై కొడవలితో దాడిచేసి, హత్యాయత్నంకు ప్రయత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండా ల కాలనీ చెందిన సాయిలు బాబు గ్రామంలో ని ఓ రైతు వద్ద భూమితోపాటు సాగునీటికి మోటారు, పైపు గొట్టాలను కౌలుకు తీసుకున్నా డు. ఈ ఏడాది మేనెలలో కౌలు ఒప్పందం పూర్తి కావడంతో కౌలు రైతుకు సాయిలు బాబు నీటి గొట్టాల్లో 13 గొట్టాలు తక్కువగా ఇచ్చాడు. ఈవిషయంపై సాయిలుబాబు ములకల నాగరాజుని తన గొట్టాలు ఏమైనా తీశావా అని అడుగుతున్నాడు. ఆదివారం మరోమారు అడగడంతో నాగరాజు తనపై దొంగతనం నెపం వేస్తున్నావంటూ కోపోద్రిక్తుడై తన ద్విచక్ర వాహనంలో ఉన్న కొడవలితో సాయిలు బాబుపై దాడి చేశాడు. దాంతో ఆయన చెంప భాగంలోని చెవి కింద తీవ్రగాయమైంది., వెంటనే సాయిలు బాబుని భద్రాచలంలోని ఓ వైద్యశాలకు తరలించారు. గాయంకు 15కుట్లు వేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు పిఠాపురం విద్యార్థుల ఎంపిక

పిఠాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తాటిపాకలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాక్సింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పిఠాపురం పట్టణంలోని లిటిల్ సోల్జర్స్‌స్కూలు పదోవ తరగతి విద్యార్థిని బి.నాగరుతిక 46 కిలోల విభాగంలో, బాష్యం స్కూలు 9వ తరగతి విద్యార్థి జేఆర్ అరుణ్ 70కిలోల విభాగంలో జరిగిన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 19 నుంచి 21వరకూ మచిలీపట్టణంలో జరిగే బాక్సింగ్‌పోటీల్లో పాల్గొంటారు.


బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కాకినాడ

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ భావన తెలిపారు. నగరపాలక సంస్థ సమావేశమందిరంలో ఉదయం 9.30గంటల నుంచి డయల్ యువర్ కమిషనర్ తదుపరి 10 గంటల నుంచి 1వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహిస్తామని చెప్పారు.

తాగునీరు కలుషితమవుతున్నా పట్టించుకోరా?

సామర్లకోటలో ప్రధాన పైప్‌లైన్ల నుంచి తాగునీరు లీకులు

నిర్లక్ష్యంగా ఇంజనీరింగ్ అధికారులు

సామర్లకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణంలో పలు ప్రాంతాల్లో ప్రధాన పైప్‌లైన్ల నుంచి తాగునీరు లీకులు, తదనంతరం అక్కడి మురుగునీరు, బురదనీరు తిరిగి పైప్‌లైన్లలోకి చేరడంతో తాగునీరు నిత్యం కలుషితం అవుతున్నా మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఎంత మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు నిత్యం ప్రజల నుంచి వినవస్తున్నాయి. మున్సిపాల్టీలో శాశ్వత సిబ్బంది సరిపడకపోవడంతో పనులు నిత్యం పెండింగ్‌లో ఉంటుండగా కాంట్రాక్ట్ పద్ధతిన ఒక్కొక్కరికీ నెలకు రూ.23 వేల చొప్పున తీసుకున్న సిబ్బంది సేవలను పక్కదారి మళ్లిస్తూ సమస్యలను విస్మరించడంతో మున్సిపాల్టీలో పలు వార్డుల్లో పైప్‌లైన్ లీకులు ఎక్కడి



మెహెర్ కాంప్లెక్స్ వద్ద పైప్‌లైన్ లీకులు

చందాన అక్కడే అనే రీతిలో పెరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం పక్కనే మెప్మా కార్యాలయం ఎదురుగా చింతల శ్రీనివాస్‌కుచెందిన ఇంటి వద్ద మురుగునీరు పారుదల లేకపోవడం, తాగునీటి పైప్‌లైన్లు మురుగుకాలువ మీదుగా వెళ్లడం కారణంగా మురుగునీరు తాగునీటిలోకి చేరడమే గాక ఇంట్లో ఉన్న బావిలోకి సైతం చేరి కలుషితం కావడంతో అధికారులకు ఫిర్యాదులు చేయడం, తూతూ మంత్రంగా పనులు నిర్వహించడం తిరిగి యథాతథంగా సమస్య కొనసాగడం జరుగుతుందని శ్రీనివాస్ ఆరోపించారు. దీంతో మున్సిపల్ కార్యాలయానికి కేవలం పది మీటర్ల దూరంలోనే ఉన్న సమస్యను పట్టించుకోని అధికారులు శివారు ప్రాంతాల ప్రజలకు ఎలా సేవలందిస్తారని పలువురు ఆరోపిస్తున్నారు. మెహెర్ కాంప్లెక్స్ వద్ద ప్రధాన పైప్‌లైన్ లీకుల కారణంగా రెండు రోజులుగా తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకున్న అధికారులే కరువయ్యారన్న విమర్శలు ఉన్నాయి. నిమ్మతోటకు వెళ్లే ప్రధాన రహదారిలో పైప్‌లైన్ లీకులు గత కొంతకాలంగా ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేశారన్న ఆరోపణలున్నాయి. గతంలో ఉదయం తాగునీటి కుళాయిలు వదిలే సమయాల్లో మున్సిపల్ ఉన్నతాధికారులు అన్ని వార్డుల్లో పర్యటించి తాగునీరు సరఫరా, పారిశుధ్య చర్యలు, వీధిలైట్లు పనితీరు వంటి సమస్యను పర్యవేక్షించేవారు. అయితే ఈ విధానానికి గత కొంత కాలంగా అధికారులు తిలోదకాలిచ్చారన్న ఆరోపణలు పలువురు కౌన్సిలర్ల నుంచే వస్తున్నాయి.



రథంషెడ్డు ఎదురుగా పైప్‌లైన్ లీకులు

భీమేశ్వరాలయంలో విశేష కార్తీక పూజలు



సామర్లకోట భీమేశ్వర ఆలయంలో విశేష అలంకరణలో స్వామివారు

సామర్లకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మహాపర్వదినాలు పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున గోపూజలు నిర్వహించి పూజలను ప్రారంభించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న తదితరుల వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేకపూజలు, పుష్పార్చన పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచీ అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున అమ్మవారిని, స్వామివారిని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. శ్రీపాద రాజశేఖర ఘనాపాఠి నేతృత్వంలో మధ్యాహ్నం జరిగిన లక్షపత్రి పూజలలో సామర్లకోటకు చెందిన కూరగాయల గొల్లబాబు అనిత దంపతులు, కుసుమంచి శేషగిరిరావు పావని దంపతులు, కుసుమంచి శ్యామ్‌కుమార్ హారిక దంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద జరిగిన ఆకాశదీప పూజల్లో గొల్లబాబు, శేషగిరిరావు, శ్యామ్‌కుమార్‌ల దంపతులు ఆశీనులయ్యారు. కార్తీక దీపారాధన సంఘ సభ్యులు నిర్వహించిన జ్యోతిర్లింగార్చన పూజల్లో అధికంగా భక్తులు పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో భాగంగా ఆలయ ఆవరణలో సుమారు 3,500మందికి అన్నదానం చేశారు.

తాటిపర్తిలో షష్ఠి ఉత్సవాలకు పందిరిరాట ముహూర్తం



తాటిపర్తిలో ముహూర్తం చేస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో స్వయంభూగా వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో డిసెంబరు 7వ తేదీ నుంచి షష్ఠి మహోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు నిమిత్తం ఆదివారం పందిరిరాట ముహూర్తం చేశారు. 6రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు ఉమ్మడి తూర్పుగోదావరితో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి, కె.చైతన్య ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, సభ్యులు ఉన్నారు.

చదలాడ గ్రామంలో...



పెద్దాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చదలాడ గ్రామంలో షష్ఠి ఉత్సవాలకు ఆదివారం పందిరిరాట ముహూర్త కార్యక్రమం నిర్వహించారు. సంప్రదాయ బద్ధంగా పందిరిరాటకు ప్రత్యేక పూజలు నిర్వహించి ముహూర్తరాటను వేశారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ షష్ఠి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోడిగుడ్డు త్రిమూర్తులు, తాడాల ఏసుబాబు, చంద్రపాటి వీరబాబు, బత్తుల సీతారామయ్య, కర్నీడి వెంకటసురేష్, చిన్న, ప్రభాకరరావు, కొండబాబు తదితరులున్నారు.

సత్తెమ్మ ఆలయంలో విశేష పూజలు

సామర్లకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట సత్యనారాయణపురం సత్తెమ్మ ఆలయం వద్ద కార్తీకమాస మహాపర్వదినాలు పురస్కరించుకుని ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకురాలు రెడ్డిపల్లి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మాండవ్యనారాయణ స్వామి భక్తమహిళామండలి వల్లూరి సీత, మద్దాల గీత తదితరులచే లలితాపారాయణ, విష్ణుసహస్రనామపారా యణ పూజలు నిర్వహించారు. నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. మహాన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై అన్నప్రసాదాలను స్వీకరించారు. బీజేపీ నాయకులు డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర, వైసీపీ పట్టణాధ్యక్షుడు మద్దాల శ్రీను, కౌన్సిలర్ సేపేని సురేష్, టీడీపీ నాయకులు వర్రే రవి, మినీవేన్ స్టాండ్ అసోసియేషన్ ప్రతినిధులు, పారాయణ సంఘ సభ్యులు పాల్గొన్నారు. అలాగే సామర్లకోట మదుగులమ్మ ఆలయం వద్ద కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో సుమారు 2 వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

శ్లోకాల పోటీల్లో నేమాం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పద్మావతి

సర్పవరం జంక్షన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాస్థాయిలో శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్లోకాల పోటీల్లో కాకినాడ రూరల్ నేమాం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాలుర విభాగంలో బండి కన్నయ్యదొర ద్వితీయ బహుమతి, బాలికల విభాగంలో రేవు ప్రవల్లిక బహుమతి సాధించినట్టు హైస్కూల్ ఉపాధ్యాయురాలు సీహెచ్ పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం

సర్పవరం జంక్షన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సర్పవరం జంక్షన్‌లో ఎస్‌ఆర్‌ఎంటీ అపార్టుమెంట్స్‌లో ఆదివారం హరేకృష్ణ మూవెంట్స్ ఆధ్వర్యంలో ఘనంగా కార్తీక దీపోత్సవం నిర్వహించారు. హరేకృష్ణ మూవ్మెంట్ ప్రెసిడెంట్ డాక్టర్ నిష్కించిన భక్తదాస కార్తీక మాసం, దీపోత్సవం విశిష్టతపై భక్తులకు అనుగ్రహ ప్రవచనం చేశారు. కార్తీక తులసి పూజలు, కృష్ణ అష్టోత్ర పూజ, దామోదర ఆరతి, నెయ్యి దీపాల హారతి, మంత్ర మెడిటేషన్ వంటి ఆధ్యాత్మిక పూజా కార్యక్రమాలు జరిగాయి.



శ్రీకృష్ణుడికి కార్తీక పూజల దృశ్యం

నిరుపేదల అభ్యున్నతికి తోడ్పాటు

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ



ఎమ్మెల్యే నానాజీకి జ్ఞాపిక అందజేస్తున్న శ్రీబాల గణపతి సేవా సంఘం సభ్యులు

సర్పవరం జంక్షన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాపు సామాజిక వర్గంలో ఉన్న నిరుపేదల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. ఆదివారం పెనుమర్తి మామిడితోటలో రాయుడు పాలెంకు చెందిన శ్రీబాల గణపతి కార్తీక మాస కాపు 7వవనసమారాధన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ కార్తీక వన సమారాధన పేరిట అంతా కలసి మెలసి సమావేశం కావడం, ఒకరి కష్టసుఖాలు మరొకరు పాలు పంచుకోవడం మంచి పరిణామమన్నారు. గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో పిల్లలు, మహిళలకు పలు గేమ్స్ నిర్వహించారు. పోటీల్లో రాణించిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పులూరి బుల్లయ్య, విజ్జపురెడ్డి ఏసుబాబు, ట్రెజరర్ గాది చక్రరావు, అడబాల రత్నప్రసాదరావు, మాదారపు తాతాజీ, పుల్ల శ్రీరాములు ఉన్నారు.

నానాజీకి అభినందనలు

విలీన గ్రామ పంచాయతీల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని పలు ప్రజా సంఘాల నాయకులు అభినందలు తెలిపారు. ఆదివారం గొడారిగుంటలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో పలు ప్రజా సంఘాలు, పౌర సంఘాల సభ్యులు ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేలిచ్చి అభినందనలు తెలిపారు. ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం ప్రతిపాదన చేసి సుమారు 13 ఏళ్లు కావస్తున్నా, 6 విలీన గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలు, సాంకేతిక ఇబ్బందులపై ఏ ఒక్క ఎమ్మెల్యే అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లిన దాఖలాలు లేవన్నారు. విలీన గ్రామాల తరఫున ప్రజల పక్షాన గొంతుక వినిపించిన ఎమ్మెల్యే నానాజీని ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విలీన గ్రామాల సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విలీన పంచాయతీల భవితవ్యంపై పరిష్కరించడం జరుగుతుందని హామీ ఇచ్చారు.

భూపతి రంగారావు ఆదర్శనీయుడు

వైఎస్‌ఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బుద్ధ విహార్ వ్యవస్థాపక సభ్యులు, రిటైర్డు ట్రెజరీ అధికారి ఉపాసకులు భూపతి రంగారావు ఆదర్శనీయుడని వైఎస్‌ఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి అన్నారు. కాకినాడ బుద్ధవిహార్‌లో భూపతిరంగారావు సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా రంగారావు చిత్రపటానికి డాక్టర్ బాబ్జి, ఉపాధ్యక్షుడు దాసరి వెంకటరావు నివాళులర్పించి మాట్లాడారు. రంగారావు నిస్వార్థపరుడని, అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. ఉపాసిక శ్రీలక్ష్మి మిలింద ప్రశ్నలు అనే అంశంపై విశ్లేషణాత్మక వివరణలతో ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షురాలు డాక్టర్ భానుమతి, జేఎన్టీయూకే ప్రొఫెసర్ తిరుమలకుమార్, బుద్ధ విహార్ కోశాధికారి పి.రాంప్రసాద్, డాక్టర్ పావన కుమార్, లెక్చరర్ రామారావు పాల్గొన్నారు.



రంగారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



కాకినాడలో చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు

కాకినాడ సిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా నాలుగోరోజు తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో ఆదివారం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్స్ విభాగంలో బాల బాలికలకు స్వచ్ఛభారత్ అంశంపై చిత్రలేఖనం పోటీలు జరిగాయి. ఈ పోటీలకు గాంధీనగర్‌శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు ఆధ్వర్యం వహించారు. ముఖ్య అతిథిగా బాలమంత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు అంగర గోపాలకృష్ణ(కృష్ణశ్రీ) మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణ స్పృహ ఉండాలన్నారు.

పెద్దాపురంలో కవి సమ్మేళనం

పెద్దాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాహితీ స్రవంతి అధ్యక్షుడు డాక్టర్ జ్యోష్యుల కృష్ణబాబు అధ్యక్షత వహించగా అభ్యుదయ కవి చల్లా విశ్వనాథం ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాలు, గ్రంథాలయాలు అనే విషయంపై మాట్లాడారు. కవిత్వం సామాజిక అంశం అనే విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, సిబ్బంది బుల్లియ్య సాహితీవేత్తలు పాల్గొన్నారు.



పెద్దాపురంలో ఏనుగు లక్ష్మణకవి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సాహితీవేత్తలు

కాకినాడలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కాకినాడ సిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చిన్ననాటి స్నేహితుల కలయిక నేటితరం పిల్లలకు మార్గదర్శనంగా ఉంటుందని డైరెక్టర్ ఆఫ్ వెల్ తోర గ్రూప్ యూఏఈ, సినీ నిర్మాత డాక్టర్ గోపీచంద్ వల్లభనేని అన్నారు. కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ పదోతరగతి 1991 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం కాస్మోపాలిటన్ క్లబ్‌లో వేడుకగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన గోపీచంద్ వల్లభనేని సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన తమ బ్యాచ్ విద్యార్థులను కలుసుకుని చిన్ననాటి అనుభూతులను పంచుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు, చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో అందరూ ఉల్లాసంగా గడిపారు. ఉన్నతిస్థితికి చేరుకున్న గోపీచంద్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంకేఎం చిష్టి, చిక్కం శ్రీనివాస్, అమర్నాథ్, ఆదినారాయణ, సత్యనారాయణరెడ్డి, రత్నకుమార్ పాల్గొన్నారు.



కాకినాడలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

పెద్దాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని ఆర్‌బీ కొత్తూరు గ్రామంలో శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి పర్యవేక్షలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. శిబిరంలో సుమారు 200 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గాలి బంగ్లాలో చేనేత సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్తీక వన సమారాధనకు హాజరయ్యారు. సబ్బినీడి హరిబాబు, సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురం మండలం ఆర్‌బీ కొత్తూరులో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న చినరాజప్ప

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

సామర్లకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవడం ద్వారా సమాజంలో మంచికార్యక్రమాలకు సహకరించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. ఆదివారం సామర్లకోట మండలం గొంచాల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న కనకదుర్గ ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముమ్మిడి సూరిబాబు, ముమ్మిడి వెంకటేశ్వరరావు, పోతుల శ్రీనివాస సత్యనారాయణ పిన్నింటి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'చిన్నారుల హక్కులను కాపాడాలి'



పిఠాపురంలో మాట్లాడుతున్న ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మీ

పిఠాపురం. నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చిన్నారుల హక్కులను కాపాడుతూ బాల్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మీ అన్నారు. బాలల హక్కులు, ప్రజా చైతన్య వారోత్సవాల్లో భాగంగా పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో మహిళా శిశు సంక్షేమశాఖ, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, జిల్లా బాలల పరిరక్షణ విభా గం ఆధ్వర్యంలో ఆదివారం అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. బాలల హక్కులు, పరిరక్షణ, సురక్షితమైన స్పర్శ, చెడు స్పర్శ, బాల్య వివాహాలా నిరోధం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని చెప్పారు. బాలలను వేధింపులకు గురిచేసినా, బాలకార్మికులు పనిచేస్తున్నట్టు తెలిసినా 1098 ఉచిత ఫోన్‌కు సమాచారం అందించాలని కోరారు. చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్టు జిల్లా కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, శిశుగృహ మేనేజరు నూకరత్నం పాల్గొన్నారు.

'సత్యాగ్రహ దీక్షలతో సమస్యల పరిష్కారం'

సామర్లకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు, పీఎఫ్ సమస్యల పరిష్కారానికి సత్యాగ్రహ దీక్షల ద్వారానే సాధ్యమైందని కాకినాడ జిల్లా యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, చక్రవర్తిలు తెలిపారు. ఆదివారం సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ఆవరణలో పట్టణ యూటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఎన్నికల అధికారి నూకరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.

నూతన అధ్యక్షుడిగా గణేష్

సామర్లకోట పట్టణ యూటీఎఫ్ అధ్యక్షుడిగా ఆర్.గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవా అధ్యక్షుడిగా కెవీవీ.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కే.శ్రీనివాస్, కోశాధికారిగా సయ్యద్ సైపుల్లా, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా ఆర్.శైలజ, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.రాజా తదితర ఏడుగురు కార్యదర్శులు, ముగ్గురు జిల్లా కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని యూటీఎఫ్ ఉపాధ్యాయసంఘ సభ్యులు సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఇటీవల పొందిన ఉర్దూ ఉపాధ్యాయుడు సయ్యద్ సైపుల్లాను సామర్లకోట పట్టణ యూటీఎఫ్ కార్యవర్గం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, యూటీఎఫ్ జిల్లా బాధ్యులు పి.గిరిధర గోపాలరావు, కేవీవీ సత్యనారాయణ, వై.ప్రభాకర్, టి.శ్యామ్ సుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పి.మల్లవరం సర్పంచ్ మృతి

తాళ్లరేవు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పి.మల్లవరం గ్రామసర్పంచ్ దున్నా సత్యనారాయణ (56) ఆదివారం మృతిచెందారు. ఆయన గత రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతు కన్నుమూశారు. 1995లో పి.మల్లవరం సర్పంచ్‌గా, టీడీపీ మండలాధ్యక్షుడిగా, త్రిరత్న బౌద్ధ దమ్మ సంఘం అధ్యక్షుడిగా, మండల ప్రజాపరిషత్ కోఆప్షన్ సభ్యుడిగా పనిచేశారు. సర్పంచ్ పార్థీవ దేహానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు నివాళులర్పించారు. ధూళిపూడి వెంకటరమణ, కూటమినేతలు, దళిత సంఘాల నేతలు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

రామ్మూర్తి నాయుడు మృతికి సంతాపం

పిఠాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతికి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సంతాపం ప్రకటించారు. పిఠాపురంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి వర్మ, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామ్మూర్తి నాయుడు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

20న జాబ్‌మేళా

పిఠాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని విరవాడ రోడ్డులో గల పీఎం విశ్వకర్మ సెంటర్‌లో ఈనెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు సూర్య ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధి పి.సతీష్ తెలిపారు. హీరో మోటోకార్ప్, డైకిన్, వింగ్‌టెక్, నియోలింక్, ఇన్ఫిలూమ్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఎంపిక జరుగుతుందని చెప్పారు. రూ.14 వేల నుంచి 21వేల జీతంతో శ్రీసిటీ, రేణిగుంట, మంబట్టుల్లో ఈ ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీవరకూ చదివిన 32 ఏళ్లలోపు పురుషులు, 34 ఏళ్లలోపు మహిళలు, ఐటీఐ చదివిన 27 ఏళ్లలోపు యువతీ యువకులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. ఇతర వివరాల కోసం ఫోన్ నెంబర్లు 7075704852, 7075904852ల్లో సంప్రదించాలని కోరారు.

రోలర్ స్కేటింగ్‌లో రాణిస్తున్న విద్యార్థులకు అభినందన

కాకినాడ అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ కనబరుస్తున్న కానిస్టేబుళ్ల కుమారులను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదివారం తన కార్యాలయంలో అభినందించారు. పోలీస్ కంట్రోల్ రూంలో కానిస్టేబులుగా పనిచేస్తున్న కె.రాజేష్ కుమారుడు హన్షిత్ సుభానికేతన్ స్కూల్లో ఒకటో తరగతి చదువుతూ రోలర్ స్కేటింగ్‌లో రాణిస్తున్నాడు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న వి.వీరకృష్ణ కుమారుడు వి.రిషీశ్వర్ స్కైలాబ్ గ్లోబల్ స్కూల్లో రెండో తరగతి చదుతున్నాడు. హన్షిత్, రిషీశ్వర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. ఇటీవల మైసూర్‌లో జరిగిన అంతరాష్ట్ర రోలర్ స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



కానిస్టేబుళ్ల కుమారులను అభినందిస్తున్న ఎస్పీ

అంతర్ జిల్లాల కబడ్డీ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన జిల్లా కబడ్డీ క్రీడాకారులు

సామర్లకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సామర్లకోటలోని అయోధ్య రామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం సాయంత్రం అంతర్ జిల్లాల కబడ్డీలో పురుషుల, స్త్రీల క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్, కోశాధికారి నిమ్మకాయల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ మండలాల నుంచి హాజరైన క్రీడాకారుల ప్రతిభాసామర్థ్యాలు పరిశీలించేందుకు పోటీలు నిర్వహించి తుది జట్టు క్రీడాకారులను ఎంపిక చేశారు. డిసెంబరు 5 నుంచి 8 వరకూ ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరగనున్న 71వ అంతర్ జిల్లాల కబడ్డీ పురుషుల, స్త్రీల పోటీలకు సామర్ల కోటలో ఎంపిక చేసిన జట్టు క్రీడాకారులు పాల్గొంటారని శ్రీనివాస్ తెలిపారు. జిల్లా జట్టు క్రీడాకారులను జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కమిషనర్ శ్రీవిద్య అభినందించారు.

శ్రీ ప్రకాష్‌లో 'ఉల్లాసంగా ఉత్సాహంగా'

తుని రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉల్లాసంగా ఉత్సాహంగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. విద్యార్థులు ఒక్క రోజు ఆహ్లాదంగా గడపాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ భానుమూర్తి తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రంపచోడవరం కేంద్రంగా
పోలవరం జిల్లాను ఏర్పాటుచేయాలి

రంపచోడవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు లేఖ రాశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని 26 జిల్లాలుగా ఏర్పాటుచేసి రంపచోడవరం నియోజకవర్గాన్ని పాడేరులో కలిపారని, తద్వారా రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని 11 మండలాలు పాడేరు ప్రధాన కేంద్రానికి చేరాలంటే సుమారు 200 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. గతంలో తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగా ఉన్నప్పుడు 80 కిలోమీటర్లు ఉండేదన్నారు. గోదావరి వరద బాధితులను పరామర్శకు వచ్చిన సమయంలో పోలవరం జిల్లా ఏర్పాటుకు హామీఇచ్చారని లేఖలో గుర్తు చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కారం రంగారావు

రంపచోడవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించేందుకు మునురు మిల్లి ఆశ్రమ పాఠశాలలో ఆదివారం గిరిజన సంక్షేమ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి కారం రంగారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులకు విధి నిర్వహణలో వచ్చే ఇబ్బందులు తదితర సమస్యలపై రాష్ట్ర స్థాయిలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా కోఆర్డినేట్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కె.ఆర్.పి.కుమార్, గిరిజన సంక్షేమ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు బి.మంగిరెడ్డి, ఆదివాసీ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బోండ్ల వరప్రసాద్‌రావు, కుంజం సత్యనారాయణదొర పాల్గొన్నారు.

'లద్దె పురుగు నివారణకు చర్యలు చేపట్టండి'

చింతూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వరి పంటను ఆశించిన లద్దె పురుగు నివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా చింతూరు వ్యవసాయశాఖ అధికారి డి. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. మండలంలో 4300 హెక్టార్లలో వరి సాగు జరిగిందన్నారు. పంట చేతికొస్తున్న దశలో లద్దెపురుగు ఉధృతి కానవస్తోందన్నారు. లద్దె పురుగు నివారణకు ఒక ఎకరాకు అఫ్ లీటరు వేపనూనె, అఫ్ లీటరు క్లోరిఫైరి పాస్ 20 ఈసిలను పిచికారీ చేయాలని శ్రీనివాసరావు సూచించారు. సాయంత్రం మూడు గంటల నుంచి పంట మొత్తం తడిచే విధంగా పిచికారీ చేసినట్లైతే ఫలితం ఆశించవచ్చన్నారు.

వాహనాలు తనిఖీ

వై.రామవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చవిటిదిబ్బలు గ్రామంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఏజెన్సీ ప్రధాన రహదారుల గుండా వెళుతున్న వాహనాలను నిలిపి వాహనదారులను ప్రశ్నించారు. నిబంధనలు అనుసరించి వాహనాలు నడపాలని అన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

రంపచోడవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ అధికారిణి పి.లక్ష్మి అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతూరి నాగభూషణం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, కవిసమ్మేళనం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎస్.నాగలక్ష్మి, పి.సత్యవతి, వి.సత్తిబాబు, కె.బాలాజీ పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

వై.రామవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వై.రామవరం శాఖాగ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో నాల్గవరోజు పాఠశాల విద్యార్థులకు కవిసమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు, చిత్రలేఖనం, వక్తృత్వం, మ్యూజికల్ చైర్స్ వంటి క్రీడాపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల, ఆశ్రమ పాఠశాల, జడ్పీవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామ్మూర్తి నాయుడికి టీడీపీ నాయకుల నివాళి





రామ్మూర్తినాయుడు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చింతూరు, ఎటపాక టీడీపీ నాయకులు

చింతూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు సోదరుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారారామ్మూర్తి మృతి పట్ల చింతూరు టీడీపీ నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి, కార్యదర్శి మల్లెల వెంకటేశ్వరరావు, నాయకులు ఆకోజు నూకాచారి, వాస శ్రీరామ్‌రెడ్డి, కట్ట శంకర్, శ్యామల వినోద్, సోయం రవికుమార్, సయ్యద్ ఆసిఫ్, పాతిమా తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: సీఎం చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారారామ్మూర్తి నాయుడికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. రామ్మూర్తినాయుడి చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. టీడీపీ సీనియర్ నాయకులు పాటి చలప తిరావు, నలజాల శ్రీకాంత్‌చౌదరి గడేసుల రంజిత్ మా ట్లాడారు. కార్యక్రమంలో పాటి సంపత్, ఎంకన్న, ఐటీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ బాచినేని శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్తీక వన సమారాధనలు

పాల్గొన్న ప్రజాప్రతినిధులు





జగ్గంపేట వన సమారాధనలో మాట్లాడుతున్న గీత, పాల్గొన్న నాయకులు.. కిర్లంపూడిలో భోజనాలు

జగ్గంపేట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని స్థానిక గోకవరం రోడ్డులో గల కాపు కల్యాణ మండలంలో కాపు వన సమారాధన నిర్వహించారు. వేలాదిగా కాపులు హాజరై ఉమ్మడిగా వనభోజనాలు చేశారు. వనసమారధనకు టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సహాయ సహకారాలు అందించారు. మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు వరుపుల సుబ్బారావు, వంగా గీత విశ్వనాథ్, ఎమ్మెల్సీ అనంతబాబు, ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, జనసేన పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు ఇన్‌చార్జులు మర్రెడ్డి శ్రీనివాస్, తుమ్మలపల్లి రమేష్, వరుపుల తమ్మయ్యబాబు, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ చైర్మన్ తుమ్మలబాబు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. జగ్గంపేట ఆర్యవైశ్యులందరూ కొత్త భైరవ కృష్ణ పామ్ ఆయిల్ తోటలో వన సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరవ్వగా ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కొత్త కొండబాబు దంపతులు, డిస్ట్రిక్ గవర్నర్‌గా ఎన్నికైన మానేపల్లి బంగార్రాజు దంపతులను ఆర్యవైశ్య కులస్తులు ఘనంగా సత్కరించారు.

కిర్లంపూడిలో...

కిర్లంపూడి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవరం గ్రామంలో మాదారపు పోలారావు సత్యనారాయణ పొలంలో వన సమారాధన నిర్వహించారు. భారీగా ప్రజలు హాజరై భోజనాలు చేశారు. మాదారపు ఆదినారాయణ, జేజేలు వీరబాబు, గౌరీశంకర్, ప్రగడ వీరబాబు, గంగాధర్, కండేపల్లి రమణ, పెంకే బాబురావు, పాలిక నర్సయ్య, నెల్లి వెంకన్న, తుమ్మలపల్లి వీరభద్రరరావు, శ్రీను పాల్గొన్నారు. కిర్లంపూడిలో ఏఎన్ఎల్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో వన సమారాధన నిర్వహించారు. పెంటకోట మూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరం గ్రామాల భక్తులు, వాకర్స్ క్లబ్ సభ్యులు హాజరై భోజనాలు చేశారు. మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, సాయి ఉన్నారు.

గండేపల్లిలో...

గండేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గండేపల్లిలో వెలమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మాజీ సొసైటీ అధ్యక్షుడు పరిమి బాబు, కందుల చిట్టిబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు హాజరై వన భోజనాలు చేశారు.

ప్రత్తిపాడులో...

ప్రత్తిపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక ఆదర్శ రైతు కర్రి రామకృష్ణారెడ్డి పామాయిల్ తోటలో ఘనంగా వనసమారాధన నిర్వహించారు. ధర్మవరం, ఒమ్మంగిలలోని తోటల్లో కార్తీక వన సమారాధనలు జరిగాయి. ఎరకంపల్లి, తోటపల్లి, ధారపల్లి జలపాతాల వద్ద సందర్శకులు సందడి చేశారు.

20న జాబ్‌మేళా

పిఠాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని విరవాడ రోడ్డులో గల పీఎం విశ్వకర్మ సెంటర్‌లో ఈనెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు సూర్య ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధి పి.సతీష్ తెలిపారు. హీరో మోటోకార్ప్, డైకిన్, వింగ్‌టెక్, నియోలింక్, ఇన్ఫిలూమ్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఎంపిక జరుగుతుందని చెప్పారు. రూ.14 వేల నుంచి 21వేల జీతంతో శ్రీసిటీ, రేణిగుంట, మంబట్టుల్లో ఈ ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీవరకూ చదివిన 32 ఏళ్లలోపు పురుషులు, 34 ఏళ్లలోపు మహిళలు, ఐటీఐ చదివిన 27 ఏళ్లలోపు యువతీ యువకులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. ఇతర వివరాల కోసం ఫోన్ నెంబర్లు 7075704852, 7075904852ల్లో సంప్రదించాలని కోరారు.

రామ్మూర్తి నాయుడు మృతికి సంతాపం

పిఠాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతికి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సంతాపం ప్రకటించారు. పిఠాపురంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి వర్మ, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామ్మూర్తి నాయుడు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అయ్యప్ప పడిపూజ

ఏలేశ్వరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం రాత్రి అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. షిర్డినగర్‌లో గుర్రం లోవరాజు మహాగంగ దంపతుల సహకారంతో గురుస్వాములు పూర శ్రీను, జింకల సత్తిబాబు, దండు స్వామి, కందుల ప్రభాకర్ ఆధ్వర్యంలో అరటి డొప్పలతో తయారు చేసిన మందిరంలో గణపతి, అయ్యప్ప స్వామి, కుమార స్వామి చిత్రపటాలకు 300 మంది స్వాములు లక్ష బిల్వార్చన, పడిపూజ జరిపారు. భక్తులకు ప్రసదాలు అందజేశారు. ఆకాశ బుల్లియ్య, పిన్నం శివరామకృష్ణ, ముద్రగడ వీరేంద్ర, గోగుల మూర్తి, వెంకట రమణ, సత్యనారాయణ, యల్లమరాజు తదితరులున్నారు.

భారీ వాహనాల రాకపోకలను బంద్ చేయాలి



కత్తిపూడిలో ధర్నా చేస్తున్న దృశ్యం

శంఖవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మా పిల్లల కంచాల్లో మట్టికొట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్న భారీవాహనాల రాకపోకలను బంద్ చేయాలని మండలంలోని కత్తిపూడి దళితవాడలో గ్రామస్తులు ధర్నా నిర్వహించి వాహనాలను అడ్డగించారు. రౌతులపూడి నుంచి కాకినాడ వంటి ప్రాంతాలకు తరలివెళ్లే భారీ వాహనాల వల్ల రోడ్డు ఇరువైపులా ఉండే ఇళ్లల్లో, వారు తినే కంచాల్లో బూడిద పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపక్కనే ఉన్న పాఠశాలలో పిల్లలు అన్నంతో పాటూ లారీల ద్వారా వచ్చే బూడిద తింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రోడ్డుపై నీటిని చల్లినా ఇబ్బందులు కొంతవరకూ తగ్గుతుందని లారీ యజమానులు అదీ కూడా చేయడంలేదన్నారు. వెంటనే భారీ వాహనాల రాకపోకలు ఈ దారిలో నిషేధించాలని లేకపోతే ఈసారి ధర్నా హైవేపై చేస్తామని దళిత నేతలు హెచ్చరించారు. ధర్నా కారణంగా రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

హాస్టల్స్ తనిఖీ చేసిన పోలీసులు

గండేపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామేశ్వరంపేటలో ఆదివారం జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్‌ఐలు యువి శివనాగబాబు, రఘునాధరావు ప్రైవేట్ హాస్టల్స్ తనిఖీ చేశారు. గదులు, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. విద్యార్థులు ఏ అంసాఘిక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. బాగా చదువుకుని ఉన్నత విద్యావంతులు కావాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ప్రారంభం

జగ్గంపేట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం సీతానగరంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నూతన ఆలయం ఆదివారం ప్రారంభించారు. స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించి వేద పండితుల ఆశీర్వాదాలను అందుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, టీడీపీ మండలాధ్యక్షులు మారిశెట్టి భద్రం, అడపా తాతాజీ, పాంద్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, బోధ శివ, కొంద్రోతు శ్రీను,భక్తులు పాల్గొన్నారు.

తాటిపర్తిలో షష్ఠి ఉత్సవాలకు పందిరిరాట ముహూర్తం

గొల్లప్రోలు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో స్వయంభూగా వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో డిసెంబరు 7వ తేది నుంచి షష్ఠి మహోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు నిమిత్తం ఆదివారం పందిరిరాట ముహూర్తం చేశారు. 6రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు ఉమ్మడి తూర్పుగోదావరితో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి, కె.చైతన్య ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారుల హక్కులను కాపాడాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మీ

పిఠాపురం. నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చిన్నారుల హక్కులను కాపాడుతూ బాల్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మీ అన్నారు. బాలల హక్కులు, ప్రజా చైతన్య వారోత్సవాల్లో భాగంగా పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో మహిళా శిశు సంక్షేమశాఖ, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. బాలల హక్కులు, పరిరక్షణ, సురక్షితమైన స్పర్శ, చెడు స్పర్శ, బాల్య వివాహాలా నిరోధం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని చెప్పారు. బాలలను వేధింపులకు గురిచేసినా, బాలకార్మికులు పనిచేస్తున్నట్టు తెలిసినా 1098 ఉచిత ఫోన్‌కు సమాచారం అందించాలని కోరారు. చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్టు జిల్లా కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, శిశుగృహ మేనేజరు నూకరత్నం పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలను అడ్డుకున్న పోలీసులు

జగ్గంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్ల దొడ్డి గ్రామంలో నిర్మాణం చేసిన అస్సాగో ఈథైల్ ఆల్కహాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా జరిగిన ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వారిపై పోలీసులు చేసిన లాఠీఛార్జిలో గాయపడిన వారిని పరామర్శించేందుకు వెళ్తుండగా జగ్గంపేట కాంగ్రెస్ నేతలు మరోతి శివ గణేష్, వత్స వాయి సత్యనారాయణ, నక్క సత్యనారాయణను గోకవరం మండలం వీర్లంక పల్లి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. శివగణేష్ మాట్లాడుతూ పోలీసులు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని, భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడం తగదని అన్నారు. కాంగ్రెస్ నేతలు కొండ శ్రీను, బొల్లం బాపిరాజు, మాసరపు అప్పారావు, ఏగుపాటి మహేష్ పాల్గొన్నారు.

కళాకారులకు సన్మానం

ప్రత్తిపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలోని కాశీ విశ్వేశ్వర రాజరాజేశ్వరిదేవి ఆలయంలో 5రోజులుగా సప్తాహ మహోత్సవాలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం 3 మహిళాభజన సమాజాలతో పాటు వెందుర్తి, గొద్ది కొత్తపల్లి, యండపల్లి గ్రామాలకు మరో 3 మహిళా భజన సమాజాలు నిర్వహించడంతో మహిళా భజన బృందాలకు సప్తాహ నిర్వాహక కమిటీ కోఆర్డినేటర్ సానా నూకరాజు నాయుడు కళాకారులను సన్మానించి బహుమతి ప్రదానం చేశారు.